క్లుప్తంగా

అధికార పార్టీని వీడిన పీఏసీఎస్ మాజీ చైర్మన్

దౌల్తాబాద్: పీఏసీఎస్ మాజీ చైర్మన్ తూర్పునీలారెడ్డి బీఆర్ఎస్‌ను వీడి శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నీలారెడ్డికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డిని కలిశారు.

బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడిగా 'దేశమోని'


నియామకపత్రం అందుకుంటున్న శ్రీనివాస్

పరిగి: బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడిగా దేశమోని శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి శనివారం శ్రీనివాస్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిత్యం ప్రజల మధ్యే ఉంటూ పార్టీ అభ్యున్నతికి పాటు పడాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయం సాధించేలా ముందుకు సాగాలని చెప్పారు. ఇందులో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు విజయరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మిట్ట పరమేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

ఎన్నికల బరిలో సీపీఐ

కొడంగల్ రూరల్: అసెంబ్లీ ఎన్నికల బరిలో సీపీఐ పోటీ చేస్తుందని ఆ పార్టీ సీనియర్ నాయకులు ఇందనూర్ బషీర్, నారాయణపేట జిల్లా సహాయ కార్యదర్శి చౌడాపూర్ శ్రీనివాసులు చెప్పారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పోటీలో నిలిచేందుకు తీర్మానం చేశారు. త్వరలోనే పార్టీ అభ్యర్థిని ప్రకటించనున్నట్లు వెల్లడించారు. ఇందులో పార్టీ నియోజకవర్గ కార్యదర్శి మహిమూద్, వివిధ మండలాల కార్యదర్శులు శ్యాంసుందర్, రాజు, లక్ష్మణ్, మల్లప్ప, రాజిరెడ్డి, ముఖ్య నాయకులు అబ్దుల్ రహీం, ముస్తాఫ, ఖాన్‌సాబ్, చెన్నారం అనంతమ్మ, నీటూర్ సర్పంచు వెంకటప్ప, గుండప్ప, ఎర్ర రాజు, మొగులప్ప, ఆనంద్ ఉన్నారు.

కాంగ్రెస్‌లోకి ప్రవీణ్‌గౌడ్


పార్టీలో చేరుతున్న ప్రవీణ్‌గౌడ్

తాండూరు రూరల్: రామలింగేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ ప్రవీణ్‌గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం మండల పరిధి జినుగుర్తి గ్రామంలో డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహవార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ప్రవీణ్‌గౌడ్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

సోషల్ మీడియాలో పార్టీల ప్రచారం

దౌల్తాబాద్: గతంలో ఎన్నికల ప్రచారం అంటే వాహనాలకు మైకులు, డప్పు చప్పుళ్లు వాల్‌పోస్టర్లు, వాల్‌రైటింగ్ ఉండేవి. ఈ ఎన్నికల్లో వాటికి బదులు సోషల్ మీడియాను వినియోగించేందుకు రాజకీయ నాయకులు మొగ్గు చూపుతున్నారు. నియోజకవర్గాల వారీగా కొందరు నాయకులు గ్రూపులు ఏర్పాటు చేసి, తమ అభ్యర్థి పార్టీ విధానాలను వివరిస్తూ పోస్టులు పెడుతున్నారు. పార్టీల మేనిఫెస్టోలను సామాజిక మాధ్యమాల్లో పెట్టి అభిప్రాయాలను తెలపాలని కోరుతున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రచారం చేస్తూ.. తమ ఉనికిని చాటుకునేందుకు తాపత్రయ పడటం గమనార్హం.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి


చండీహోమంలో పాల్గొన్న ఈఓ సుధాకర్

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని పాంబండ రామలిగేశ్వర దేవస్థానం ఈఓ సుధాకర్ అన్నారు. శనివారం కుల్కచర్ల మండలం బండవెల్కిచర్లలో రామలింగేశ్వర ఆలయంలో చండీహోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేవి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని దేవాలయంలో 9 రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజకార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఇందులో ఆలయ అర్చకులు పాండు శర్మ ఉన్నారు.

ఎమ్మెల్యే బాటలో నడుస్తాం

అనంతగిరి: వికారాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ బాటలో నడుస్తామని పెద్ది అంజయ్య అన్నారు. గతంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా కొనసాగిన ఆయన.. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. వికారాబాద్ ప్రాంత అభివృద్ధికి ఎమ్మెల్యే ఎనలేని కృషి చేస్తున్నారని, దసరా అనంతరం అనుచరులతో కలిసి అధికార పార్టీలో చేరనున్నట్లు అంజయ్య చెప్పారు.


పెద్దేముల్: లక్ష్మీదేవి అవతారంలో తుల్జామాత


ధారూరు: లలితా త్రిపురసుందరిగా అమ్మవారు


అనంతగిరి: వైభవలక్ష్మి ఆలయంలో సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

లక్ష్మీదేవిగా అమ్మవారు..

దేవీ నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో ఘనంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా అమ్మవారు శనివారం వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా భక్తజనం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు కుంకుమార్చనలు చేశారు.

–సాక్షి, నెట్‌వర్క్


వికారాబాద్: రామ మందిరంలో 108 రకాల ప్రత్యేక హారతులతో పూజలు చేస్తున్న మహిళలు


కుల్కచర్ల: కుంకుమార్చన చేస్తున్న మహిళలు


కొడంగల్ రూరల్: హస్నాబాద్‌లో సరస్వతీ దేవి అవతారంలో అమ్మవారు


కొడంగల్ రూరల్: రుద్రారంలో దుర్గాదేవిగా..

పేదల బతుకులు మారడం లేదు

- జాతీయ మహాసభలను విజయవంతం చేద్దాం
- కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య


మాట్లాడుతున్న జంగయ్య

కొందుర్గు: ఎన్ని ప్రభుత్వాలు మారినా పేదల బతుకులు మారడం లేదని సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య పేర్కొన్నారు. బీహార్‌లోని పాట్నాలో నిర్వహించనున్న భారతీయ కేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ మహా సభలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. శనివారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం చెన్నారెడ్డిగూడలో నిర్వహించిన సీపీఐ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. పేదలకు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామని మోసం చేశారని ఆయన గుర్తు చేశారు. సీపీఐ మండల కార్యదర్శి వెంకటేశ్, చిన్నయ్య పాల్గొన్నారు.

వెండివెన్నెల్లో 'వెన్న ముద్దల' బతుకమ్మ


మోమిన్‌పేట: ఎన్కేపల్లిలో హనుమాన్ మందిరం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా మహిళలు, చిన్నారులు ఎనిమిదో రోజైన శనివారం వెన్న ముద్దల బతుకమ్మలను పేర్చి వెండి వెన్నెల్లో ఆడిపాడారు. అనంతరం పూల గోపురాలను గంగమ్మ ఒడికి చేర్చారు. ఈ సందర్భంగా వెంట తెచ్చుకున్న ప్రసాదాన్ని ఇచ్చుకుంటినమ్మ వాయినం పుచ్చుకుంటినమ్మ అంటూ పంచిపెట్టుకున్నారు.

–సాక్షి, నెట్‌వర్క్


తాండూరులో అలరించిన బతుకమ్మ


దౌల్తాబాద్‌లో మహిళల ఆటపాట


పూడూరు: సోమన్‌గుర్తిలో బతుకమ్మతో మహిళలు, చిన్నారులు


తాండూరు: మల్‌రెడ్డిపల్లిలో.. బతుకమ్మ సంబురాల్లో మహిళలు, చిన్నారులు


తాండూరు రూరల్: చెంగోల్లో బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే సతీమణి ఆర్తిరెడ్డి

బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లోకి..


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ఆనంద్

మోమిన్‌పేట: బీజేపీ నుంచి పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. మండల పరిధి గోవిందాపూర్ నుంచి బీజేపీ మండల అధ్యక్షుడు వెంకట్, మండల యువత అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, నాయకుడు భిక్షపతి ఆధ్వర్యంలో కార్యకర్తలు భారీగా ఎమ్మెల్యే ఆనంద్ సమక్షంలో శనివారం అధికార పార్టీలో చేరారు. ప్రతి ఒక్కరూ పార్టీ గెలుపునకు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.

ఊరంతా ఉత్సవాలు

బొంరాస్‌పేట: తుంకిమెట్లలో దుర్గామాత ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఏడోరోజు శనివారం దుర్గమ్మ పూజలు ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ సంబురాల్లో భాగంగా మహిళలు, చిన్నారులు 95 బతుకమ్మలను పేర్చారు. దుర్గామాత ఎదుట ఆటపాటలతో అలరించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

సామాజిక మాధ్యమాలపై ఈసీ నిఘా

పార్టీలకు, వ్యక్తులకు వ్యతిరేకంగా పోస్టులు పెడితే.. అడ్మిన్‌లదే బాధ్యత: ఎస్ఐ

దౌల్తాబాద్: సాధారణ ఎన్నికల నేపథ్యంలో సామాజిక మాధ్యమాలపై ఎన్నికల సంఘం ప్రత్యేక నిఘా పెట్టింది. వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగాం తదితర గ్రూపుల్లో పార్టీలకు వ్యతిరేకంగా, నాయకులను కించపరిచే విధంగా పోస్టులు పెడితే ఈసీ ఆదేశాల మేరకు పోలీసులు కేసులు నమోదు చేయనున్నారు. అందులో భాగంగా శనివారం దౌల్తాబాద్ ఎస్ఐ రమేష్‌కుమార్ మాట్లాడారు. సోషల్ మీడియాలో పార్టీలకు వ్యతిరేకంగా, నాయకులను రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టినా, అనుచిత వ్యాఖ్యలు చేసినా చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని,అందుకు ఆయా గ్రూపుల అడ్మిన్‌లే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

విగ్రహాల ఏర్పాటుకు విరాళం

చేవెళ్ల: మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు శనివారం రావులపల్లి గ్రామంలో పోచమ్మ దేవాలయ నిర్మాణానికి బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంతరెడ్డి రూ.51వేలు, సమతా సైనిక్‌దళ్ జిల్లా అధ్యక్షుడు మాచన్‌పల్లి రామస్వామి రూ.21వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయాలు, మహనీయుల విగ్రహాల నిర్మాణానికి ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఉండాలని కోరారు.

కనుమరుగవుతున్న 'వామ'

మద్దతు ధర, మార్కెట్ సౌకర్యం లేక సాగుకు మొగ్గుచూపని రైతులు


వామ పంట

పెద్దేముల్: వామ పంట సాగు మండలంలో గణనీయంగా తగ్గింది. పత్తి, కంది, చెరుకు పంటకు చూపిస్తున్న శ్రద్ధ రైతులు వామ సాగుపై చూపడం లేదు. ఆశించిన మేర దిగుబడి రావటం లేదని, ఒక వేళ వచ్చినా.. విక్రయించుకునేందుకు మార్కెట్ సౌకర్యం లేదని పలువురు రైతులు చెప్పడం గమనార్హం. ఇవన్నీ ఉన్నా.. మద్దతు ధర లేదని చెప్పారు. గతంలో మండల పరిధి ఇందూరు, మారేపల్లి, నర్సపూర్, పెద్దేముల్, గోపాల్‌పూర్, నాగులపల్లి, ఆత్కూర్, గిర్మాపూర్ తదితర గ్రామాల్లో రైతులు అధికంగా వామను సాగు చేసేవారు. ప్రస్తుతం సాగు చాలా వరకు తగ్గింది. మారేపల్లి, ఆత్కూర్, ఇందూరు గ్రామాల్లో సాగు 100 ఎకరాలు దాటడం లేదని వ్యవసాయ అధికారుల ద్వారా తెలుస్తోంది.

తగ్గిన దిగుబడి

గతంలో ఎకరాకు సుమారు నాలుగు నుంచి ఐదు క్వింటాళ్ల దిగుబడితో పాటు లాభం వచ్చేదని, ప్రస్తుతం పెట్టుబడులు పెరిగి, కూలీల కొరతతో గిట్టుబాటు కావడం లేదని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం ఎకరాకు దిగుబడి క్వింటా కూడా దాటడం లేదంటున్నారు. దానికి తోడు మార్కెట్లో కనీసం రూ.15 వేలకు పైగా ధర పలికితేనే చేసిన కష్టానికి తగిన ఫలితం ఉంటుందంటున్నారు. మార్కెట్ అందుబాటులో లేక వికారాబాద్ వెళ్లి విక్రయించాల్సి వస్తోందని, మార్కెట్‌తో పాటు ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తే సాగుచేస్తామని రైతులు చెప్పడం గమనార్హం.

ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

అనంతగిరి: పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్, ఎంఎస్ఎఫ్ జిల్లా కో ఆర్డినేటర్ ఆనంద్ అన్నారు. శనివారం వికారాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ముఖ్య నాయకులతో ఆయన మాట్లాడారు. నవంబర్ 7న 20లక్షల మందితో నిర్వహించే విశ్వరూపం మహాసభ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే యాత్ర అక్టోబర్ 19న ఆదిలాబాద్‌లో ప్రారంభమవుతుందని, 29న మోమిన్‌పేటకు చేరుకుంటుందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఇందులో జిల్లా నాయకులు రాజు, పుష్పరాణి, అంజి, రాములు, మల్లేశం, జగన్, రవి, జాని, ప్రశాంత్, పరశరాం, ప్రవీణ్ ఉన్నారు.

'గ్యారంటీ'గా పథకాల అమలు


దౌల్తాబాద్: ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు

దౌల్తాబాద్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అధిష్టానం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలతో పాటు మేనిఫెస్టోలు పొందు పరచిన హామీలు నెరవేరుతాయని ఆ పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి నర్సింగ్ భాన్‌సింగ్ అన్నారు. శనివారం దౌల్తాబాద్ మండలం బిచ్చాల, గుముడాల గ్రామాల్లో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ పథకాలను వివరిస్తూ ప్రచారం చేశారు. ఇందులో పార్టీ జిల్లా నాయకులు వెంకట్ రెడ్డి, వీరన్న, ఎంపీటీసీ మంజుల, నాయకులు భీములు, నర్సప్ప ఉన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

చేవెళ్ల: పల్గుట్ట రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 58లో నక్షరోడ్డు, గ్రామకంఠం భూమి 800గజాలు కబ్జా చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని శనివారం గ్రామానికి చెందిన దేవులపల్లి శ్రీనివాస్ రెడ్డి పల్గుట్ట గ్రామస్తులతో కలిసి చేవెళ్ల ఆర్డీఓ సాయిరాంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, గ్రామస్తుల అనుమతి లేకుండా విలువైన గ్రామకంఠం భూమిని, నక్షరోడ్డును సర్పంచ్ ఎం. జనార్దన్‌రెడ్డి, అతని అనుచరులు కబ్జా చేస్తున్నారని వారు ఆరోపించారు. దేవాలయం పేరుతో అనుమతి లేకుండా నిర్మాణం చేపడుతున్నారన్నారు. ఈ భూమి గ్రామ పంచాయతీకి అవసరమని, భవిష్యత్తులో దుకాణ సముదాయం నిర్మిస్తే పంచాయతీకి ఆదాయం సమకూరుతుందని పేర్కొన్నారు. ఇందులో శివకుమార్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి అయోడిన్ ముఖ్యం

- డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి


ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ జయలక్ష్మి

షాద్‌నగర్: సంపూర్ణ ఆరోగ్యానికి అయోడిన్ ముఖ్యమని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి పేర్కొన్నారు. అయోడిన్ డిసార్డర్ ప్రివెన్షన్ డే సందర్భంగా శనివారం షాద్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రి నుంచి చౌరస్తా వరకు ఆరోగ్య సిబ్బంది నిర్వహించిన ర్యాలీని డాక్టర్ జయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే మనం తీసుకునే ఆహారంలో అయోడిన్ ఉండే విధంగా చూసుకోవాలన్నారు. అయోడిన్ లోపంతో చాలామంది ఎన్నో అనారోగ్యం సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. అయోడిన్ అనేది కేవలం ఉప్పు ద్వారానే కాకుండా సముద్రపు చేపలు, రొయ్యలు, గుడ్లు, పాలు, పెరుగు, మాంసం తదితర వాటిని తినడం ద్వారా శరీరానికి కావలసిన అయోడిన్‌ను సమకూర్చుకోవచ్చన్నారు. అయోడిన్ లోపంతో ఎక్కువగా థైరాయిడ్ సమస్య, గాయిటర్ వ్యాధి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు స్రవంతి, నిఖిత, అమృత జోసెఫ్, తబస్సు, విజయలక్ష్మి, హరికిషన్, రాఘవేందర్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పట్టని కాంగ్రెస్, బీజేపీ

ఎంపీపీ రవీందర్‌యాదవ్

కొత్తూరు: రాష్ట్రంలో అన్ని గ్రామాలు, గిరిజనతండాలు బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే అభివృద్ధి చెందాయని ఎంపీపీ రవీందర్ యాదవ్ అన్నారు. కొత్తూరు మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో ఆయన శనివారం సర్పంచ్ అజయ్‌నాయక్‌తో బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశాన్ని 60 ఏళ్లు పాలించిన కాంగ్రెస్, బీజేపీలు ఎందుకు అభివృద్ధి చేయలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైతే కరెంట్ కోతలు, రియల్ వ్యాపారంతో పాటు ఇతర వ్యాపారాలు పూర్తిగా తగ్గిపోతాయని ఆయా పార్టీలు ఆరోపణలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చిన 9 ఏళ్లలోనే రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో 24 గంటల విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మె సత్యనారాయణ, మిట్టునాయక్, ఇంద్రసేనారెడ్డి, యాదగిరి, కృష్ణ, సిరాజ్, గోపాల్‌నాయక్, శ్రీరాములు యాదవ్, సతీష్‌గుప్తా పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు ఓటేస్తే ఆగమే..

- కేసీఆర్ మాటలు నమ్మి మరోసారి మోసపోవద్దు
- కాంగ్రెస్ వస్తే 'గ్యారంటీ'తో తెలంగాణకు మేలు
- ఇంటింటి ప్రచారంలో హస్తం నేతలు, మాజీ మంత్రి తనయ అనన్య


అనన్యకు స్వాగతం పలుకుతున్న గిరిజన మహిళలు

ధారూరు: ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ విఫలమయ్యారని, సీఎం మాటలు నమ్మి మరోసారి ఓటేస్తే మోసపోతామని మాజీమంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ కూతురు అనన్య అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అనన్య, ఆమె భర్త చేతన్, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి ధారూర్ మండలం జీడిగడ్డతండా, శేరిగడ్డతండా, పులిచింతమడుగుతండా, అంపల్లితండా, గురుదోట్ల, అంపల్లి తదితర గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల గురించి విస్తృత ప్రచారం చేశారు. అనంతరం వారు మాట్లాడారు. బీఆర్ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. తెలంగాణలో నిరుద్యోగం పెరిగిందన్నారు. ఉపాధి లేక యువత తీవ్ర నిరాశతో ఉన్నారన్నారు. అధికార పార్టీ నాయకులు డబ్బులు ఇచ్చి ప్రతిపక్ష నాయకులను కొంటున్నారని ఆరోపించారు. ఓట్లు వేసేందుకు డబ్బులు ఇస్తే తీసుకోండని, ఆ పైసలన్నీ మనవేనని ప్రజలకు సూచించారు. ప్రజా సమస్యలు తీర్చే నాయకున్ని ఎన్నుకోవాలని, ఆస్తులు కూడబెట్టుకొనే వారిని కాదని హితవు పలికారు. మనం ఎవరినీ విమర్శించడం లేదని, మనకున్న ఆయుధమనే ఓటుతో వారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. కేసీఆర్ మాటలు నమ్మి మరోసారి ఓటేస్తే ఆగమైతామని, మాజీమంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్‌ను గెలిపిస్తే గ్యారంటీ పథకాలు అమలు జరిగి ప్రజలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. ప్రచారంలో భాగంగా పర్యటిస్తున్న కాంగ్రెస్ నేతలకు గిరిజనులు బతుకమ్మ ఆటపాటలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పట్లోళ్ల రాములు, రాంపూర్‌తండా సర్పంచ్ పాండునాయక్, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బసప్ప, ఎంపీటీసీలు శ్రీనివాస్, రవి, నాయకులు మాన్‌సింగ్, మహ్మద్ బాబాఖాన్, బాలప్ప తదితరులు పాల్గొన్నారు.